శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) నిర్వహణ

- మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 9, ప్రభాతవార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జిఒవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబరు 9, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 14249 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 71.895టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 560 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.746 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సాలిపేటలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- మద్యం మత్తులో కూలుతున్న కుటుంబాలు! - తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ మహిళల విజ్ఞప్తి




**తోటపల్లి గూడూరు,నవంబర్ 9 ప్రభాతవార్త :** మండలంలోని సాలిపేట, మిగతా 22 పంచాయతీ పరిధిలో మొబైల్ వైన్ షాపులు.మరియు బెల్ట్ వ్యాపారం రోజురోజుకూ ఊపందుకుంటోందని మహిళలు భయాందోళన చెందుతున్నారు.సాలిపేట సెంటర్ అన్ని చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉండటంతో, మద్యం అక్రమ విక్రయ కేంద్రాలు (బెల్ట్ షాపులు) పెరగడానికి ఇది అనుకూల స్థలంగా మారింది.

**బెల్ట్ షాపుల దందా ఊపందుకుంది**

వైన్‌షాపు యాజమాన్యం బెల్ట్ షాపులకు నేరుగా మద్యం ఇవ్వకపోవడంతో,ఈ దందాకు కొత్త పంథా కనుగొన్నారు. ఒక్కొక్కరి పేరుతో మూడు మూడు క్వార్టర్లు తీసుకువచ్చి, వాటిని బెల్ట్ షాపుల వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్క క్వార్టర్‌పై 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ, మందుబాబులను దోచుకుంటున్నారు.ఈ విధంగా రోజూ లక్షల్లో అక్రమ లాభాలు కొట్టేస్తున్నా రని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాణాలను బలిగొంటున్న మద్యం**

ఇటీవల సాలిపేటలో ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది.ఈ సంఘటనతో గ్రామంలో ఆందోళన మొదలైంది. మద్యానికి బానిసలైన మగవాళ్ల చేతుల్లో కుటుంబాలు దెబ్బతింటున్నాయి, మహిళలు తమ తాళిబొట్లు కోల్పోతున్నారు అని స్థానిక మహిళలు కన్నీటి పర్యంతమవుతున్నారు. మద్యం మత్తులో దాంపత్య బంధాలు కూలిపోతున్నాయని, గ్రామాల ఆర్థిక పరిస్థితి దారుణంగా మారుతోందని వారు వాపోతున్నారు.

**మహిళల ఆవేదన : కలెక్టర్‌కి విజ్ఞప్తి**

సాలిపేట, కాటేపల్లి, అనఃతపురం, నరుకూరు, వరిగొండ, కోడూరు మేజర్ పంచాయతీ లాంటి పరిసర గ్రామాల మహిళలు కలెక్టర్ గారికి వినతి పత్రాలు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా శుభ్రమైన సమాజం కావాలని మద్యం దుకాణాల అడ్డదారులు మూసివేయండి అంటూ వారు కోరుతున్నారు.

**అధికారులు తీసుకోవాల్సిన చర్యలు**

మొబైల్ బెల్ట్ షాపులపై ప్రత్యేక దాడులు చేపట్టాలి, మద్యం సరఫరాపై కఠిన నిఘా విధించాలి,అక్రమ విక్రయాల్లో పాల్గొన్నవారిపై క్రిమినల్ కేసులు




నమోదు చేయాలి,గ్రామ స్థాయిలో మద్యం నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలి,మద్యం మాన్పు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

**సమాజం మేలుకోక తప్పదు**

మద్యపు మత్తులో మునిగిపోతున్న సమాజాన్ని రక్షించాలంటే ప్రభుత్వం, పోలీసులు, మహిళా సంఘాలు కలిసి కట్టుగా పనిచేయాలి. సాలిపేటలో ప్రారంభమైన ఈ మద్యం మాఫియా దందా ఆగకపోతే, ఇది త్వరలోనే మండలమంతా వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# పేదలందరికీ ఇళ్ళుపై ఆడిట్

**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 9, ప్రభాత వార్త** జిల్లాలో నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జరిగిన ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఆడిట్ జరగనుంది. ఎన్.బాలాజీ సింగ్ ఆడిట్ అధికారిగా గల బృందం 17వ తేదీ నుండి 27వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో ఇందుకు సంబంధించి ఆడిట్ ప్రక్రియ నిర్వహించనుంది.

# శిథిలవస్థకు చేరుకున్న ప్రభుత్వ కార్యాలయాలు, మోక్షం ఎప్పుడు?





**కొడవలూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహశీల్దార్, వ్యవసాయ,వికలాంగు శిశు సంక్షేమ ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తహశీల్దార్ కార్యాలయము కు వెళ్లాలంటే ఇరిగేషన్ బంగ్లా కి వెళ్ళాలి, వ్యవసాయ కార్యాలయం కు రైతులు పోవాలంటే ఎంపీడీవో కార్యాలయం కు చేరుకోవాలి, జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయం కు పోవాలంటే సంఘమిత్ర కార్యాలయంకు వెళ్లాలి ఇలా మండలంలో ప్రజలు ప్రభుత్వ అధికారులకు పలు సమస్యలపై తెలుపుటకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అతి కీలకమైన రెవెన్యూ భవనం ఎన్నో ఏళ్ల నుండి శిథిలవస్థలో చేరుకుంది.

# ఏళ్ల కల.. వీపీఆర్ కృషితో నెరవేరిన వేళ


File Photo 18 December 2024

- జాతీయ రహదారి
- 16పై చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు 115 కోట్లు మంజూరు
- వీపీఆర్ అనుకుంటే సాధించి తీరుతారని మరోసారి రుజువైంది
- గతంలో నిత్యం ట్రాఫిక్, ప్రమాదాలతో అవస్థలు పడే ప్రజలు
- ఇకపై ప్రమాదాలకు తావుండదు.. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేదు
- చింతారెడ్డిపాలెం జంక్షన్ నుంచి ముత్తుకూరు రోడ్డు వరకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల ఏర్పాటు
- సీఎం చంద్రబాబుకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి
- వేమిరెడ్డి కృషి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



File Photo 24-July 2024

**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** నిత్యం ట్రాఫిక్ సమస్యలు.. తరచూ రోడ్డు ప్రమాదాలు రహదారి దాటాలంటే డేంజర్ బెల్స్.. ఇది ఇప్పటి వరకు జాతీయ రహదారి 16పై చింతారెడ్డిపాలెం జంక్షన్ పరిస్థితి. ఇకపై ఆ పరిస్థితుల్లో మార్పులు రానున్నాయి. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అవిశ్రాంత శ్రమతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి-16 చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకోసం ఏకంగా రూ.115 కోట్లు కేటాయించింది. ఇన్నాళ్ళ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పడిన కష్టానికి ఫలితం దక్కినట్లయింది. దాంతో స్థానిక ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు నిత్య శ్రామికుడిలా పని చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నారు.

**గెలిచినప్పటి నుండి 4 సార్లు నితన్ గడ్కరీతో సంప్రదింపులు**

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఎంపీగా గెలిచినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఈ నేపధ్యంలో గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో జాతీయ రహదారులపై ఉన్న సమస్యలు, చింతారెడ్డిపాలెం వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు వంటి అంశాలపై కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో 4 సార్లు ఢిల్లీలో భేటీ అయి మాట్లాడారు. తొలి సారి జులై 24, 2024న ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. చింతారెడ్డిపాలెం జంక్షన్ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే జులై 25న ఇదే సమస్యను లోక్ సభలో ప్రస్తావించారు. అనంతరం సెప్టెంబర్5, 2024న కేంద్ర రహదారుల అభివృద్ధి విభాగం డైరక్టర్ జనరల్ సారంగితో భేటీ అయి సమస్యను వివరించారు. అలాగే నవంబర్ 27, 2024న ఒక సారి, డిసెంబర్ 18, 2024న మరో సారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఇటీవల ఆగష్టు 18న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. జిల్లాలో జాతీయ రహదారుల సమస్యల పరిష్కారం, వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించారు.

**నిత్యం భయం.. భయం ఎట్టకేలకు అభయం**

జాతీయ రహదారి-16 నుంచి నెల్లూరు నగరంలోకి ప్రవేశించేందుకు చింతారెడ్డిపాలెం జంక్షన్ చాలా కీలకమైంది. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు ఈ జంక్షన్ గుండా వెళ్తుంటాయి. సమీపంలోనే ప్రముఖ మెడికవర్ హాస్పిటల్ ఉండడంతో పాటు చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు ఈ జంక్షన్ ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి కీలకమైన జంక్షన్ ట్రాఫిక్‌కు ప్రధాన అడ్డంకిగా ఉంటూ.. ప్రమాదాలు జరుగుతుంటాయి. దాంతో ఇక్కడ వెహికల్ అండర్ పాస్(వీయుపీ) కోసం ప్రజల నుంచి భారీ డిమాండ్ ఉంది. దీని ప్రాధాన్యతను, ప్రజల డిమాండ్‌ను గుర్తించిన ఎంపీ వేమిరెడ్డి.. పట్టువిడువని విక్రమార్కుడిలా కేంద్ర మంత్రిని పలుమార్లు కలిశారు. జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు ఒప్పించి 115 కోట్ల నిధులు మంజూరు చేయించేలా శ్రమించారు. దాంతో పాటు ప్రతిపాదిత చింతారెడ్డిపాలెం జంక్షన్ వెహికల్ అండర్‌పాస్(వీయుపీ) నుంచి ముత్తుకూరు రోడ్డు వరకు జాతీయ రహదారి-16కు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు.

**సీఎం, కేంద్ర మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు**

చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి, సీఎం చంద్రబాబునాయుడుకి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇన్నాళ్లకు ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని చెప్పారు. ఇకపై ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల బెడద తప్పుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా క్షేమమే ధ్యేయంగా మరింత ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రమాదాల నివారణతో పాటు రాకపోకలకు సులువుగా ఉంటుందని, భయం గుప్పిట్లో బతుకుతున్న తమకు.. అభయం దొరికిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కలను నిజం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రైట్ కెళ్తే కాలువ, లెఫ్ట్ కెళ్తే గుంట ప్రయాణికులకు తంటా

- మలుపు ప్రమాదాలకు పిలుపు - హెచ్చరిక బోర్డు ఎక్కడ?
- పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు



**విడవలూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండలంలోని పార్లపల్లి రాళ్ల మిట్ట గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉన్నవి. నిత్యం అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు వందల సంఖ్యలో వాహనాలపై వస్తు వెళుతుంటారు. వాహన చోదకుల జాగ్రత్తలపై ఆర్ అండ్ బి అధికారులు సంబంధిత హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారిపోయినాయి. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులకు తీవ్ర గాయాలైన సంఘటన తెలిసిందే! రాత్రి సమయంలో పరిసర ప్రాంతాల ప్రజలు రోడ్డు స్థితిగతులు తెలియక జోరుగా వాహనాలను నడుపుతుంటారు. అయితే ఈ మలుపు వైపు రాకపోకలు జాగ్రత్తలు తీసుకోకపోతే అంతే సంగతులు, ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని విలువైన ప్రాణాలు కాపాడుటకు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## 34 వార్డులో ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** కావలి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు నందు వార్డు ఇంచార్జిలు పుల్లా శ్రీనివాసులు రెడ్డి,గుర్రం వెంకటేశ్వర్లు (జీవి) ఆధ్వర్యంలో ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ మెడికల్ కళాశాలను కూటం ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్నందున దీనికి వ్యతిరేకంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైసిపి కావలి నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సూచనలతో పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి సహకారంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.వార్డులో ప్రతి ఒక్కరు సంతకాల కార్యక్రమానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లా తులసి,ఆదిలక్ష్మి,కె.సుజాత,ఎస్.కే హనీఫ్, సంధాని,హరీష్,మనీ, సుభాని పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాలొన్నారు.

# నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం 10వ తేదీ ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ ఎపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా నెల్లూరు జిల్లా నుండి వినియోగదారులు మొబైల్ నంబర్ 8977716661 కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యలను ఆయా ప్రాంతాల్లో సాంకేతిక అంశాలను పరిగణలోకి తీసుకుని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సదవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800425 155333కు కాల్ చేయడం లేదా వాట్సప్ నంబర్ 9133331912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

# అభివృద్ధి సంక్షేమమేకూటమి ధ్యేయం

- పాత్రికేయ సమావేశంలో ఎమ్మెల్యే



**కందుకూరు నవంబరు 8, ప్రభాతవార్త** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో బాగంగానే రైతు సంక్షేమం నిమిత్తం రాళ్లపాడు కుడి ఎడమ కాలువల నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కందుకూరు సీటీఆర్ఐ నుంచి పట్టణంలోకి 8కోట్లతో రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభమవుతున్నాయన్నారు. నెల్లూరు డీఆర్‌సీ సమావేశంలో మత్స్యకారులకు ఇళ్ల నిర్మాణానికి ఎదురైన ఇబ్బందులుపై చర్చించినట్లు తెలిపారు. నేషనల్ హైవేలపై జరుగుతున్న ప్రమాదాల విషయంలో మాట్లాడుతూ హైవే డీపీఆర్ ఏర్పాటులో జరిగిన లోపాల వలన పలుప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తాత్కాలిక చర్యల నిమిత్తం ఏర్పాటుచేసిన డ్రమ్ముల వలన సైతం ఆశించిన పలితాలు లేవన్నారు. త్వరలో తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో బారీ మెజారిటీతో గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపే విషయంలో తమ నాయకులు పారదర్శకంగా ఉన్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత మంత్రి లోకేష్‌లు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారన్నారు. త్వరలో ప్రకాశం జిల్లాలో కలుస్తుందన్నారు. అయితే ప్రతిపక్షనేతలు లోపాయికారితనంతో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మినరసింహంతోపాటు పలువురు ఉన్నారు.

# సీఎం రిలీఫ్‌పండ్ చెక్కుల పంపిణీ

48మందికి 37.2లక్షలు అందచేసిన ఎమ్మెల్యే
బడుగు బలహీన వర్గాల సంక్షమానికి పెద్దపీట




**కందుకూరు నవంబరు 9 ప్రభాతవార్త** బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.ఇందులో బాగంగా నియోజకవర్గంలోని 48మందికి రూ.37.21 లక్షల రూపాయల చెక్కులను ఆయన లబ్దిదారులుకు అందచేశారు.అభివృద్ధి, సంక్షేమం,ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు.. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో 777 మంది లబ్ధిదారులకు రూ.6.30 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇందుకు ముఖ్యమంత్రిచంద్రబాబుకి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలన్నారు.బసిరెడ్డిపాలెంకు చెందిన లబ్ధిదారు యనమలమంద రమాదేవితోపాటు పలువురు మాట్లాడుతూ పేదలమైన తమకు ఆపదలో చేయూతనిస్తున్న ముఖ్యమంత్రికి స్ధానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

- వలేటివారిపాలెం మండలం 13 మంది లబ్ధిదారులకు 6.75 లక్షలు,లింగసముద్రం మండలం 15 మందికి రూ. 8.08 లక్షలు గుడ్లూరు మండలం 8 మందికిరూ.3.66 లక్షలు, ఉలవపాడు మండలం 12 మందికి రూ.18.72 లక్షలు వెరసి 48 మంది లబ్ధిదారులకు 37.21 లక్షల అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు,లింగసముద్రం తెదెపా అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు తెదెపా నేతలు మాదాల లక్ష్మినరసింహం, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, నాదెళ్ల వెంకటరమణయ్య పాల్గొన్నారు.

## 2029లో వైసిపి అధికారంలోకి రావడం తధ్యం



**సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త :** వైసిపి యువజన విభాగ అగ్రనాయకుడు బైరెడ్డి సిద్దార్ధరెడ్డితో ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వూటుకూరు నాగార్జునతో కలిసినెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దు క్రిష్ణమన ాయుడు మర్యాదపూర్వకంగా బేటి అయ్యారు. ముందుగా బైరెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పాలగిరి ముద్దు కృష్ణమనాయుడు మాట్లాడుతు ఉదయగిరి నియోజకర్గంలో రాబోయే రోజులలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి యువనాయకుడు మేకపాటి అభినవ్ రెడ్డిల సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ యూత్ నిర్వహించబోయే సమావేశాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విధివిధానాల ప్రణాళికల గురించి చర్చించామన్నారు. రాబోయే 2029ఎన్నికలలో ఉదయగిరి నియోజకర్గంలో వైఎస్ఆర్ పార్టీ గెలుపులో బైరెడ్డి సిద్దార్ధరెడ్డిని భాగస్వామ్యం కావాలని యూత్ ఆద్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గోనాలని కోరామన్నారు. ఈకార్యక్రమంలో మండల వైసిపి యూత్‌నాయకులు కప్పా ప్రదీప్, సురేంద్రరాజులు, తదితరులు పాల్గోన్నారు.

## బోజ్జనపల్లిలో పుట్టం ఆధ్వర్యంలో జోరుగా కోటి సంతకాల సేకరణ



**రాపూరు, నవంబరు09ప్రభాతవార్త :** మండలంలోని బోజ్జనపల్లి పంచాయితీలో వెంకటగిరి నియోజకవర్గం వైయస్సార్‌సిపి ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆదేశాలతో, వైసిపి సిఇసి సభ్యుడు పాపకన్ను మధుసూధన్ రెడ్డి సూచనలతో మండల వైసిపి నాయకుడు పుట్టం రెడ్డి క్రిష్ణా రెడ్డి మెడికల్ కళాశాలల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం జోరుగా నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణులతో కలసి పంచాయితీలో ఇంటింటికి వెల్లి మెడికల్ కళాశాల ప్రవేటికరణ వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ వారి నుండి సంతకాలు సేకరిస్తున్నారు. పంచాయితీలో సంతకాల సేకరణ పూర్తి అయిన తరువాత పార్టీ సిఇసి సభ్యుడు పాపకన్ను మధుసూధన్ రెడ్డి ద్వారా నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికి వీటిని ఆందజేయనున్నట్లు పుట్టంరెడ్డి క్రిష్ణా రెడ్డి తెలిపారు.

## సిపిఎం జిల్లా కమీటి సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజుకు సతీవియోగం




**బుచ్చి నవంబర్ 9 ప్రభాతవార్త :** సిపిఎం జిల్లా కమీటి సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజుకి సతీవియోగం కలిగింది. ఆయన సతీమ ణి నర్మదా (58) డెంగ్యూతో శనివారం మృతి చెందారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని అంబేద్కర్ నగర్ బాలకృష్ణా కాలనీలో ఆమె బౌతిక కాయాన్ని సిపిఎం నాయకులు,అభిమానులు, పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కార్యవర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, కె. అజయ్‌కుమార్, మూలే వెంగయ్య, మంగళ పుల్లయ్య, జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు ముత్యాల గురునాధం, సిపిఎం సీనియర్ నాయకులు చంద్రరాజగోపాల్, గండవరపు శ్రీనివాసులు, పులిగండ్ల శ్రీరాములు, డాక్టర్లు ఎం.వి రమణయ్య, అజయ్‌కుమార్, బి.రాజేశ్వరరావు, మండల కమీటి సభ్యులు సిఐటియు కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలి వచ్చి ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యుల అనుమతితో మృతురాలు జొన్నలగడ్డ నర్మద నేత్రాలను దానం చేశారు.

## శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ఆరుద్ర నక్షత్రం సందర్బంగా ప్రత్యేకాభిషేకాలు



**సంగం నవంబర్ 9 ప్రభాతవార్త :** సంగం లోని తిరమన కొండపైన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆరుద్ధ నక్షత్రం పురస్కరించుకొని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి పీఠాదిపతులు రాజరాజేశ్వరానందస్వామి ప్రత్యేకంగా పంచామృతా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరా జేశ్వర నాందస్వామి మాట్లాడుతు కార్తిక మాసంలో ఆరుద్రనక్షత్రం విశిష్టమైన రోజు అని స్వామి తెలిపారు. ఆదివారం ఆరుద్ధ నక్షత్రం రోజు స్వామి వారికి అభిషేకాలు చేస్తే సకల శుభాలు జరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గోని కార్తీక దీపాలు పెట్టి శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారిని తిలకించారు. అనంతరం భక్తులు తీర్ద ప్రసాదాలు అందజేశారు.

## అగ్ని ప్రమాదబాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సహాయం



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** ఇటీవల బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన ఉదయగిరి శ్రీనివాసులుకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. సమాచారాన్ని కావలి రెడ్ క్రాస్ కు తెలుపగా కావలి రెడ్ క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సభ్యులు ఉదయగిరి శ్రీనివాసులు కుటుంబానికి వంటపాత్రలు,నూతన దుస్తులు, టార్పాలిన్ తో కూడిన రిలీఫ్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాద బాధితులు రెడ్ క్రాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, పాలకమ ఒడలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, గొట్టిపాటి మనోరమ,జీవిత సభ్యులు బెజవాడ అభిసాగర్ పాల్గొన్నారు.

## ఇకనైనా మారండి



**కోవూరు,నవంబర్ 9 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా రికార్డులకెక్కినవారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సభ్య సమాజంలో కలిసిపోవాలని ట్రైనీ ఎస్సై గోవర్ధనగిరి అన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగంలో ఆదివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా రికార్డులకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. లేనిపక్షంలో మీ జీవితం ఇంతేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఎస్సై నరేష్



**విడవలూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలు, కొడవలూరు సీఐ సురేంద్రబాబు సూచనలతో ఎస్సై పి.నరేష్ ఆధ్వర్యంలో ఆది వారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహ నాలకు డ్రైవింగ్ లైసెన్స్, పత్రాలు, హెల్మెంట్ తప్పనిసరిగా ఉండాలని వాహన చోదకు లకు పలు జాగ్రత్తలు వివరించి తెలిపారు. అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు.

## సర్వే నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



**వెంకటాచలం,నవంబర్ 9,ప్రభాతవార్త :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ ఫోర్ ఆధ్వర్యంలో ఎర్రగుంట గ్రామంలో ప్రత్యేక శిబిరం రెండో రోజున పూర్తి చేసుకుంది. రెండవ రోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎర్రగుంట గ్రామంలో సామాజిక, ఆర్థిక , ఆరోగ్య మరియు భౌగోళిక అంశాలు మరియు వనరులు సదుపాయాలపై ప్రత్యేక సర్వేను నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఇంటి యజమాని ద్వారా సర్వేలో పేర్కొన్నటువంటి పలు అంశాలను సేకరించారు అనంతరం సేకరి ంచినటువంటి విషయాలను శోధించి గ్రామంలో నెలకొన్నటువంటి సమస్యలు వనరులు మరియు సదుపాయాలు ప్రజలు ఏం కోరుకుంటున్నారు అనేటువంటి విషయాలను క్రోడీకరించారు. అలాగే ఈ సర్వేలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ ప్రజల బాగోగులను ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పూర్తిగా అధ్యయనం చేశారు. ఈ ప్రత్యేక శిబిరానికి సమన్వయకర్తగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి వెంకటసుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ శిబిరంలో కెమిస్ట్రీ విభాగం ఎం.బీ.ఏ విభాగం మరియు టూరిజం మేనేజ్మెంట్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు కోనసాగుతున్న అన్నప్రసాదాలు పంపిణీ



**రాపూరు,నవంబరు9ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీ మహా విష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో మండల కాల అన్నదాన కార్యక్రమంలో బాగంగా 25వ రోజైన ఆదివారం భక్తి శ్రద్దలతో అయ్యప్ప స్వామి, గోవింద స్వామి, శివ స్వామి మాలా ధరణ చేసిన స్వాములకు, మద్యాహ్న బిక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం గణపతి హోమం, అయ్యప్ప స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆలయంలో గణపతి హోమం, సాయంత్రం అకాశధీపం ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహావిష్ణువు స్వామి వారి ధ్వజస్థంభం వద్ద అకాశ దీపం పెట్టారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ బిక్ష కార్యక్రమానికి ఉభయదాతలుగా తేజస్వరూప్, ధర్మపత్ని సౌగంధిక, గంగిశెట్టి వంశీ, ధర్మపత్ని శ్రీదేవి, పాలవల్లి గోపీచంధ్, మకుంద సాయిలు వ్యవహరించారు. పలువురు అయ్యప్ప,గోవింద, శివ స్వాములు, భక్తులు తదితరులు స్వామి వారి భిక్ష స్వీకరించారు. స్వాములకు భిక్ష దాతలకు ఆలయ అర్చక స్వామి రాముమిశ్ర స్వామి వారి తీర్థ ప్రసాదాలను, వేదమంత్రాలతో అశీర్వచనాలు ఆందజేశారు.

## నాగులచింత కు దారిచూపరా!



**బిట్రగుంట నవంబర్ 9 ప్రభాతవార్త:** బోగోలు మేజర్ పంచాయతీ లోని అతిపురాతనమైన నాగులచింత కు దారిచాపాలని ప్రజానీకం కోరుతున్నారు. రైల్వే పంపు హౌస్ సమీపంలో ఉన్న నాగులపుట్టకు గతంలో నాగులచవితి రోజు, కొన్ని ప్రత్యేక సందర్భాలలోనూ వెళ్లి తమ మొక్కులు తీర్చుకొనేవారు. అయితే ఇటీవల కాల ంలో నాగులచింత కువెళ్లే దారిలఆక్రమణలు పెరిగి వెళ్లే దారే కనుమరుగు అయింది. దీంతో నాగులాచింతకు వెళ్లాలనే వారికి చింతే మిగిలింది. కావున దీనిపైన స్పందించి నాగులచింత ను కాపాడుకోవాలని కోరుతున్నారు.

## కాటంరెడ్డి జన్మదిన వేడుకలు



**అల్లూరు,నవంబర్ 9,ప్రభాతవార్త:** మాజీ శాసన సభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి 66 వ జన్మదిన వేడుకలను ఆదివారం అల్లూరులోని ఆయన నివాసము లో వైసిపి శ్రేణులు. అభిమానులు భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు బాలకృష్ణ రాజు మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి హైద రాబాదులో ఉన్న అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొనటం సంతోషంగా ఉం దని తెలిపారు. అదేవిధంగా పేద ప్రజలకు విష్ణువర్ధన్ రెడ్డి చేస్తున్న సేవలను పలువురు నాయకులు కొని యాడారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోసల గోపాల్ రెడ్డి. దండ కృష్ణారెడ్డి. సతీష్ కుమార్ రెడ్డి. కాకు వెంకటేశ్వర్లు. మేద నిరంజన్ రెడ్డి. మేద లక్ష్మణ్ రెడ్డి. మాధవరావు. పప్పు సుధాకర్.బాలు.నలగట్ల కృష్ణారెడ్డి. డేవిడ్.వైసిపి నాయకులు కార్యకర్తలు. అభి మానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టినరోజు ఆదర్శంగా నిలిచిన భావన



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** కావలి నివా సులు మక్కెన. రమేష్ ,ప్రశాంతి దంపతుల కు మార్తె భావన తన పుట్టినరోజును పురస్కరి ంచు కుని పేదల మధ్య జరుపుకోవాలనే ఆలోచ నతో ఆదివారం కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సం యుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువు కుం టున్న పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భావన మాట్లాడారు గత 13 సంవత్సరాల పాటు తన తల్లి దండ్రులు తన పుట్టినరోజును ఇంట్లోనే జరుపుతూ ఉంటారని తెలిపారు.కానీ ఈ సారి తన పుట్టినరోజును పేదల మధ్య జరుపుకోవాలని అనుకున్నానని తెలిపారు. తన తల్లి దండ్రుల తనకు పాఠశాలకు వెళ్ళే సమయంలో ఖర్చులకోసం ఇచ్చే డబ్బులను దాచుకోని ఆ డబ్బులతో నేడు తన పుట్టినరోజు సందర్భంగా పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేయడం తనకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడారు పుట్టినరోజు నాడు ఆడంబరాలకు వెళ్లకుండా వృదా ఖర్చులు చేయకుండా పాకెట్ మనీతో పేద విద్యార్థులకు కడుపు నింపటం గొప్ప విషయం అని తెలిపారు.ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన చిన్నారి భావనను అభినందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు మక్కిన రమేష్, ప్రశాంతి మరియు ట్యూషన్ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై ఆలు పెరగని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** విద్యార్థుల సమ స్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ ఎఫ్ ఐ) పెరగని పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్య దర్శి వెన్ను నరేంద్ర తెలియజేశారు. పట్టణంలోని శివరామ సుబ్బయ్య భవనంలో మహాసభ ఆదివారం నిర్వహించుకోవడం జరిగింది. ఈ మహాసభను ఉద్దేశిస్తూ వెన్ను నరేంద్ర మాట్లాడారు 1970లో ఎస్ ఎఫ్ఐ ఏర్పడినప్పటినుంచి ఇప్పటి వరకు విద్యారంగ సమస్యల కోసం విద్యార్థులను కలుపుకొని ఎస్ఎఫ్ఐ బల మైన పోరాటాలు, కార్యక్రమాలు నిర్వహిస్తూ, దేశంలోనే బలమైన విద్యార్థి సంఘంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినప్పటికీ విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏవి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.దాదాపు 6000 కోట్లకు పైగా విద్యార్థు లకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అలాగే విద్యార్థు లకుసంబంధించిన, 77 జీవో ను వెంటనే రద్దుచేసి,పీజీ విద్యార్థులకు స్కాలర్షిప్ అందే విధంగా చూడాలని అని అన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుం దని అన్నారు.ఏదైతే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీ లు తక్షణ మే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా కూడా ఆందోళన బాట పట్టడం జరుగు తుందని తెలిపారు.అనంతరం కావలి పట్టణం నూతన ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్ష, కార్యదర్శులుగా వై.జయంత్ , పి.వినీల్ ,ఉపాధ్యక్షులుగా వెంకటబాలు,సహాయ కార్యదర్శులుగా వర్షిత్, అజ్మత్,అలాగే కమిటీ సభ్యులుగా రేవంత్, చైతన్య, కౌశిక్, సోహెల్, పార్థు, తేజేశ్వర్, మోక్షిత్, డేవిడ్, మనోజ్, ఉదయ్, మహేష్ లు ఎన్నికయ్యారు.

## మెడికల్ కళాశాలలో సాధించేవరకు పోరాటం ఆగదు

**- మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి**



**వెంకటాచలం నవంబర్ 9 ప్రభాతవార్త:** మెడికల్ కళాశాలలో సాధించే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తమ పోరాటాన్ని ఆగదని సర్వేపల్లి మాజీ శాసన సభ్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆదివారం చెముడు గుంట కార్యక్రమంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఖాతాని మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయడంలో పూర్తి స్థాయిలో వైఫల్యం చెందారన్నారు. ఆడబిడ్డ నిధి నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అవినీతి ఆక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ప్రశ్నించే నాయకులు గొంతులను కేసులు నమోదు చేయడం, పోలీసుల చేత అక్రమ కేసులు వనయించి జైలుకు పంపుతున్నారన్నారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించిన వైఎస్ఆర్సీపి కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని, మరింత ఉత్సాహంతో కూటం ప్రభుత్వం చేస్తున్న అవినీతి ఆక్రమాలను ప్రశ్నిస్తామన్నారు. చూడ గుంట గ్రామంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొని కాకానికి ఘనంగా స్వాగతం పలికారు .ముందస్తుగా కాకాని జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు ఎం వెంకట శేషయ్య, మాజీ సర్పంచ్ మదన్, అనిల్ రెడ్డి, శంకర్ రెడ్డి, రాచాల సతీష్, తదితరులు పాల్గొన్నారు **-ఉప ఎంపిపిని పరామర్శించిన కాకాణి** ఉప ఎంపిపి కనుపూరు కోదండరామిరెడ్డికి ఇటీవల ప్రమాదం జరిగి తలకి గాయం కావడంతో ఆదివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి,మండలంలో వైసీపీ నాయకులతో కలిసి కోదండరామిరెడ్డి ఇంటికి చేరుకున్నారు.ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకొని కొంతసేపు కోదండరామిరెడ్డితో మాట్లాడారు.

## ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ సమావేశం



**ఉదయగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఫారెస్ట్ కార్యాలయ గెస్ట్ హౌస్ నందు ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా రాష్ట్ర లాయర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముఖ్యంగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో జనరల్ సెక్రటరీగా ప్రభుదాస్ రాష్ట్ర నాయకుడిగా సర్ధార్‌ని నియమించారని అలాగే జిల్లా బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా లాయర్ సుధాకర్‌ని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లాయర్ల సమస్యలపై చర్చించడం జరుగుతుందని అలాగే లాయర్లకు ఇళ్ల స్థలాలు అయితేనేమి ఇన్సూరెన్స్ అయితేనేమి తదితర అంశాలపై రాష్ట్ర నాయకులు చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి బార్ అసోసియేషన్ నుంచి సందిరెడ్డి, రామారావు బార్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, లాయర్ షరీఫ్, లాయర్ మస్తాన్, తిరుపతయ్య, జూనియర్ లాయర్లు తదితరులు ఎన్నికైనట్లు వారికి పూలమాలలు శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ లాయర్లు పాల్గొన్నారు.

## మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్ధనలు



**ఇందుకూరుపేట, నవంబర్ 9, ప్రభాతవార్త :** మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్ధన జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు నారాయణ, రెడ్ క్రాస్ ఏఆర్‌వి కమిటీ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్తువు, నూలుమాల సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పొనక కనకమ్మ విగ్రహానికి కమిటీ సభ్యులు గంపల, మంజుల, మన్నె చంద్రశేఖర్‌రెడ్డి, పట్టు వస్త్రము, నూలుమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పడిపూజ: ఈదూరు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



**తోటపల్లి గూడూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:** మండలంలోని ఈదూరు గ్రామంలో ఆదివారం ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి గ్రామ స్తులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై భక్తి పరవశంతో పాల్గొన్నారు. గురు స్వాముల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పూజలో 18 మెట్ల ధార్మిక పద్ధ తిలో అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అబి.షేకం చేయబడింది. అభిషేకం తరువాత ,సువా సనలతో నిండిన పూలాబి షేకం ఘనంగా జరిగింది. భక్తులు స్వామి ప్రసాదాలను అందుకొని ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు గ్రామస్థులం దరికీ భక్తి పరవశంతో మధుర స్మృతులను అందించింది.ఈ పూజ ఆధ్యాత్మిక ఉల్లాసానికి, గ్రామసంఘానికి గర్వకారణంగా నిలిచింది. ఈ భజనలో గోనెల వినోద్ స్వామి భక్తి బృందం పాల్గొన్నది.

## శనివారం ఆదాయం రూ.11.8లక్షలు



**వలేటివారిపాలెం నవంబరు 9, ప్రభాతవార్త :** మం డలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీ నం సింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించుకున్నారు.సుమారు 10వేల మందికి పైగా స్వామివారిని దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. మొక్కుబడులు చెల్లిం చారు. అన్నప్రసాదాలు స్వీకరించారు. తద్వారా స్వామివారికి వివిద పద్దుల కింద రూ.11,85,751లు మేర ఆదాయం సమకూ రింది. ఆలయ ప్రధాన అర్చకులు గౌరీశంకర్, నరసిం హాచార్యులు భక్తులకు తీర్ధప్రసాదాలు అందచేశారు.భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.10,700లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.18,320లు,వివాహాలు వలన 2వేలు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.43,450లు,వాహన పూజల వలన రూ.3,580లు, ప్రత్యేకదర్శనం రూ.4,03,700లు, స్ధలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.280లు,రూముల అద్దెలు రూ.35,990లు,కవర్లు అమ్మకం వలన రూ.9,250లు, అన్నదానం నిమిత్తం రూ.4,39,120లు లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,16,845లు,ఇతర విరాళాలు వలన రూ.2,5168లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ సహాయ కమీషనర్ చంద్రశేఖర్ తెలిపారు.క్యూలో భక్తుల రద్దీ -పర్యవేక్షించిన ఏసీ: మద్యాహ్నం 11.30గం॥ల ప్రాంతంలో సర్వదర్శన క్యూ భక్తులతో కిక్కిరిసిపోయింది.భక్తులు ఒక్కసారిగా ఎక్కువమంది రావడంతో స్వామివారిదర్శనంలో జాప్యం జరిగింది, ఈ నేపద్యంలో గంటల తరబడిక్యూలో నిల్చొన్న భక్తులు ఇబ్బంది పడ్డారు.ఈ సమాచారం తెలుసుకున్న ఏసీ చంద్రశేఖర్ తన సిబ్బందితో గర్భగుడిలోకి వెళ్లి క్యూను వేగవంతం చేశారు.త్వరితగతిన ధర్శనం చేయించి పంపించారు.అదేవిధంగా మరుగుదొడ్లలో నీళ్ల అయిపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.ఇకపోతే అన్నదాన సమీపంలో మరుగుదొడ్లసౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్లు మహిళాసేవకులు ఇబ్బంది పడుతున్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా వంటశాల పైఅంతస్థులో మరొక బోజనశాల ఏర్పాటు చేశారు.అయితే గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తులోకి ఆహారపదార్థాలు, వంటసామాగ్రి తీసుకెళ్లడానికి వర్కర్సు నానా ఇబ్బందిపడుతున్నారు. లిఫ్టుసౌకర్యం లేనందున పెద్దపెద్ద అండీలు మోసుకపోవడం ఇబ్బంది కల్గిస్తుందని పలువురు తెలిపారు. అధికారులు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ప్రతినిధి మోహనరావు మాట్లాడుతూ వంటశాల సమీపంలోనే మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటుకు ఇటీవలనే కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భూమిపూజ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. త్వరలో ఈ సౌకర్యం అమలులోకి వస్తుందన్నారు.

## మాలకొండలో ప్రకాశం జిల్లా అధికారులు



**వలేటివారిపాలెం నవంబరు 9, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లాలోని పలువురు అధికారులు ఆదివారం మాలకొండ వచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 11న మాలకొండకు సమీపాన గల పీసీ పల్లె మండలం లింగనపాలెం వస్తున్నట్లు సమాచారం.మాలకొండ పక్కనే గలలింగ నపాలెం ప్రాంతంలో ఎంఎస్ఎంఈ చిన్న తరహా ప్రాజక్టు ప్రారంబోత్సవ కార్యక్రమానికి రానున్నారు. ఈ నేపద్యంలో ఆయన రాకకు సంబందించి ఏర్పాట్లుపై సమీక్షించెందుకు మాలకొండలోని టీడీడీ కళ్యాణమండపానికి రావల్సిందిగా ప్రకాశం జిల్లా అధికారులకు సమాచారం అందింది.ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి,కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితోపాటు జిల్లా స్ధాయి అధికారులు హాజరవుతారని సమాచారం రావడంతో దాదాపు జిల్లా స్ధాయి అధికారులంతా మాలకొండ టీటీడీ కళ్యాణమండపానికి హాజరైనారు.మాలకొండలో సుమారు 50కార్లులో అధికారులు టీటీడీ కళ్యాణమండపం వద్ద ఎదురు చూచారు. ఉదయం 11గం॥లవరకు ఎవరూ రాలేదు.అయితే మాలకొండ సమీపాన గల పీసీ పల్లె మండలం లింగనపాలెం శివార్లులో సదరు కార్యక్రమ నిర్వహణకు కలెక్టర్‌పి.రాజబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణన్‌తోపాటు మంత్రి డోలా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిలు హాజరైనారు. దీంతో మాలకొండలో ఉన్న అధికారులంతా అక్కడికి వెళ్లారు.

# తప్పిపోయిన బాలురు-గంటల వ్యవధిలో చేధించిన పోలీసులు

## ప్రశంసలుఅందుకుంటున్న కందుకూరు పోలీసులు

**వలేటివారిపాలెం నవంబరు 9, ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంకు చెందిన ముగ్గురు తప్పిపోయిన ముగ్గురు పిల్లలను కందుకూరు పోలీసులు 24గంటల వ్యవదిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.దీంతో తల్లిదండ్రులుతోపాటు పలువురు కందుకూరు పోలీసులను ప్రశంసించారు. చిన్నారుల భవిష్యత్‌ను కాపాడారని తల్లిదండ్రులు గర్భశోకం నుంచి విముక్తిచేశారని పోలీసుల పనితీరును అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కందుకూరుకి చెందిన షేక్ అఫ్రోజ్ అనే మహిళ తన కుమారుడు (13)తోపాటు మరో ఇద్దరు బాలురు ఈ నెల 7వ తేదీ ట్యూషన్‌కని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కందుకూరు పట్టణ పోలీసులకు రాత్రి 11గం॥లకు పిర్యాదు చేసింది.దీంతో జిల్లా ఎస్పీ డా॥ అజిత వేజండ్ల ఐపిఎస్ నేతృత్వంలో కందుకూరు డీఎస్పీ సిహెచ్‌వి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కందుకూరు సీఐ అన్వర్‌బాషాతోపాటు పట్టణ ఎస్సై శివనాగరాజు బృందాలుకు దర్యాప్తు బాధ్యతను అప్పగించారు. కేసు దర్యాప్తు తీరును పర్యవేక్షించారు.జిల్లామొత్తం బీట్ మరియు మొబైల్ పార్టీలను కంట్రోల్ రూమ్‌కు అప్రమత్తం చేశారు. దర్యాప్తు బృందనేతల చాకచక్యంతో కేసును శోధించారు.తమదైన శైలిలో డీఎస్పీ పర్యవేక్షణలో 8వ తేదీ ఉదయం అంటే 24గంటల లోపే పిల్లల ఆచూకి తెలుసుకున్నారు. కందుకూరు నుంచి ఒంగోలుకి బస్సులో వెళ్లడం ,అక్కడ నుంచి వైజాగ్ వెళ్లెందుకు బాలురు సిద్ధమవడం అంచనావేశారు.మార్గమద్యంలో విజ యవాడలో వైజాగ్ వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రైల్వే పోలీస్‌లను ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మార్గమద్యంలో అనకాపల్లి రైల్వేస్టేషన్ పిల్లలను రైలు నుంచి దించారు. తదుపరి పిల్లలను అనకాపల్లి నుంచి కందు కూరుకు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈమొ త్తంను చిన్న సిమ్‌ద్వారా చాకచక్యంగా ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి బాధితుల కదలికలను గుర్తించి పట్టుకో వడం ప్రశంస నీయముగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు జిల్లా ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ బాలసు బ్రహ్మణ్యం కృషి సీఐ బాషా, ఎస్సై శివనాగరాజుల నిరంతర కృషి,పట్టుదల,నైపుణ్యంను పలువురు శబాష్ అని మెచ్చుకుంటున్నారు .రాత్రింబవళ్లు పోలీసులు చూపిన స్పందన మరియు నైపుణ్యం చాలా గర్వకారణంగా పలువురు వ్యాఖ్యా నిస్తు న్నారు.



## జెడ్పిటిసి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



**బిట్రగుంట నవంబర్ 9 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సూచనలతో బోగోలులో స్థానిక జడ్పిటిసి సభ్యురాలు మద్దిబోయిన కీర్తన ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం ఆదివారం చేపట్టడం జరిగినది ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యురాలు మద్దబోయిన కీర్తన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సంతకాల సేకరణలో అర్థం అవుతుందని ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయుటకు వ్యతిరేకిస్తున్నారని ఇకనైనా ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి మంచి నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొనడం జరిగినది.

## బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో అల్పాహారం అందచేసిన సమీఉల్లా



**బిట్రగుంట నవంబర్ 9 ప్రభాతవార్త:** బిట్రగుంట రైల్వే గ్రౌండ్ లో ఆదివారం బి ఏం ఆర్ యువసేన అధ్యక్షులు సమీఉల్లా ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులకి మరియు కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థి విద్యార్థులకు పౌష్టికాహారం అందచేసారు. ఈ సందర్భంగా వాకర్ అసోసియేషన్ సభ్యులు యెన్ ఎస్ యాదవ్ బర్నాడ్, కుందుర్తి శ్రీను, ఆచా ర్య బోయపాటి సుధాకర్, స్పర్జన్ రాజ్, మన్యం శ్రీనివాసులు మాట్లాడుతూ సమీఉల్లా కు ధన్యవాదములు తెలుపుతూ ఆయనకి సన్మానం చేయడం జరిగింది మరియు కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థి విద్యార్థినిలకు సేఫ్టీ కవచకాలు లేకపోయినా మాస్టర్ రవిగన్ గారు విజయనగరం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మన బోగోలు మండలం బిట్రగుంట విద్యార్థులకు కరాటేలో మెడల్స్ సాధించేందుకు రవిగన్ మాస్టర్ చాలా కృషి చేశారు అందుకుగాను 8 మెడల్స్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు వాకర్స్ కమిటీ వారు అభినందించినారు ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేత ఎస్కే జహీర్, దబ్బీరు శ్రీధర్ రావు, బిట్ర రమేష్ రుబీనా తదితరులు పాల్గొన్నారు

## కాకాణి గోవర్ధన్ రెడ్డి యూత్ అసోసియేషన్‌చే నిర్విరామంగా

**- 6వ రోజు సేవా, క్రీడా కార్యక్రమాలు- 1వ వార్డులో విద్యార్థులకు క్రికెట్ కిట్ బహుకరణ**



**పొదలకూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** మాజీ మంత్రివర్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాకాణి గోవర్ధన్ రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ రోజు సేవా కార్యక్రమాల్లో భాగంగా పొదలకూరు టౌన్‌లోని టైలర్స్ కాలనీలోని యువతకు క్రికెట్ కిట్ అందించారు. క్రీడలను ప్రోత్సహి ంచేం దుకుగాను ఈ కార్యక్రమం చేయడం జరిగిందని కాకాణి గోవర్ధన్ రెడ్డి యూత్ అసోసియేషన్ తరపున జనరల్ సెక్రెటరీ అంజాద్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆకుల గంగిరెడ్డి, కాలంశెట్టి లోకేష్, కేశం రెడ్డి భాస్కర్ రెడ్డి, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత



కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త : కోవూరు మండలం పడుగుపాడు ప్రాంతంలో రోడ్డు విస్తరణలో భాగంగా పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు పడుగుపాడు పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పెద్ద పడుగుపాడు పంచాయతీ ప్రాంతంలోని చంద్రమౌళి నగర్, శ్రీనివాస నగర్, ధాత్రి హోమ్స్ తదితర ప్రాంతాల్లో పై వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదని, అత్యవసర విభాగానికి సంబంధించిన వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## వన సమారాధన కార్యక్రమం విజయవంతం



కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త : కోవూరులోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థాన కళ్యాణ మం డపంలో ఆదివారం నిర్వహించిన శ్రీ వైకానస సం క్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వ హించిన వన సమారాధన కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయ వంతమైంది. ఈ సందర్భంగా దేవస్థాన నిర్మాణ ధర్మకర్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, నెల్లూరు జిల్లా బ్రా హ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ భువనేష్ ప్రసాద్‌లను శ్రీ వైకానస సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

## డ్యామ్‌లో అనధికారికంగా చేపలు పడితే చర్యలు-బచ్చల



**ఉదయగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయంలో ఎవరైనా అనధికారికంగా చేపలు పడితే చర్యలు తప్పవని జలాశయ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బచ్చల చెన్నారాయుడు తెలిపారు. తాము ప్రభుత్వం నుంచి అనుమతి పొంది జలాశయంలో చేప పిల్లలను వదిలామన్నారు. జలాశయం వద్ద తాము కాపలా ఉన్న కొందరు గుట్టు చప్పుడు కాకుండా జలా శయం పైతట్టు ప్రాంతంలో చేపలను వేటాడు తున్నారన్నారు. దీనిపై నిఘా ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు.

## ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా హాజీరా

**ఉదయగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త :** రాష్ట్ర ఉర్దూ అకాడమీ ద్వారా ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా షేక్ హాజీరా జీఎస్టీ (ఉర్దూ) ఎంపిక అయ్యారు. ఈమె ఉదయగిరి మండలం మాసాయిపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయగిరి మండల విద్యాశాఖారులు తోట శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయురాలు హాజీరా మాట్లాడుతూ తనను ఉర్దూ అకాడమీ గుర్తించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన వన సమారాధన కార్యక్రమం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి రుత్వికులు అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు శ్రీకాంత్ స్వామి, నాగరాజు స్వామి, రాఘవాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంకమ్మతల్లి దర్శనానానికి పెద్ద ఎత్తున భక్తులు



**రాపూరు, నవంబరు9ప్రభాతవార్త** మండలంలోని వెపినాపి గ్రామ దేవతైన పోతుకోండ అంకమ్మ తల్లి దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అంకమ్మ కోండకు చేరుకున్నారు. భక్తులు భక్తితో ప్రార్ధిస్తే కోరిన కోరికలు నేరవేర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న అంకమ్మ తల్లిని దర్శించుకునేందుకు రాపూరు మండలం నుండే కాక జిల్లాలోని ఇతర ప్రాంతల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ అర్చక స్వాములు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు.

## విశ్వనాథస్వామి దేవస్థానం వద్ద భారీ వన బోజన కార్యక్రమం

**మనుబోలు నవంబర్ 9 ప్రభాతవార్త :** మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసివున్న శ్రీ



విశ్వనాథస్వామి దేవస్థానం వద్ద ఆదివారం ఆరుద్రనక్షత్రం సందర్భంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం ,అన్నాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి మాలధరణ భక్తులకు గ్రామ ప్రజలకు భారీ వినబోజన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయ కర్తలుగా ఆలయ అర్చకులు గందర్ల శ్రీనివాసులు వ్యవహారించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని వారి మొక్కులు తీర్చుకున్నారు.

## స్వదేశీ వస్తువులనే వినియోగించండి

**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 9, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వినియోగించాలని



భారతీయ జనతా పార్టీ నేతలు పిలుపు నిచ్చారు. ఆదివారం నెల్లూరులోని మూలాపేటలో స్వదేశీ వస్తువుల కొను గోలుపై అవగాహన కల్పించారు. స్వదేశీ వస్తువుల ఆవశ్యకతను వివరి స్తూ ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పిసురేందర్‌రెడ్డి, కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్ మాట్లాడుతూ మన దేశం ఏ రంగంలోనూ ఇతర దేశాల మీద ఆధారపడకుండా శక్తివంతమైన దేశంగా మారేందుకు స్వదేశీ వస్తువుల కొనుగోలు తోడ్పడుతుందన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని చెప్పారు. స్వదేశీ విధానంతో ఆత్మనిర్భర భారత్ ఏర్పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ పద్మావతి, అల్లూరు నాగేంద్ర సింగ్, మురుగ నరేష్ కుమార్, కే.శివకుమార్, టి.శ్రీనివాసులు, రంగరాజన్, సృజన, ఆదినారాయణ, పెండ్యాల భాస్కర్, జైశ్రీకృష్ణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మెగా టాలెంట్ టెస్టు

**వింజమూరు, నవంబర్ 9, ప్రభాత వార్త:** వింజమూరులోని శ్రీ సుబ్ర హ్మణ్యేశ్వర నవోదయ ఎంసెట్ సైనిక



శిక్షణ అకాడమీ ఆధ్వర్యంలో మెగా టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహి ంచారు. అకాడమీ డైరక్టర్ బి.సురేంద్ర రాజ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెగా టాలెంట్ టెస్టును నిర్వహించగా సుమారు 350 మందికి పైగా విద్యా ర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరక్టర్ రాజు మాట్లాడుతూ అత్యుత్తమ విద్యను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులకు అధునాతనమైన సాంకేతిక విద్యను అందించేందుకు మా సంస్థ ముందుంటుందని అందులో భాగంగానే మా విద్యాసంస్థల ద్వారా మెగా టాలెంట్ టెస్టు నిర్వహించడం గొప్ప శుభ పరిణామమన్నారు. ఈ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థికి ఉచిత విద్యను అందిస్తామని రెండవ స్థాయి బహుమతి పొందిన విద్యార్థికి 70శాతం మూడో పొందిన విద్యార్థికి 50 శాతం నాలుగో బహుమతి పొందిన విద్యార్థికి 25 శాతం ఐదో బహుమతి పొందిన వారికి 20 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామన్నారు. అలాగే ఆరు నుండి 10 స్థాయిల్లో విజేతలైన వారికి 15 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా హాజరైన ప్రతి ఒక్కరికి పెన్ను ప్యాడ్ పెన్సిల్ అందజేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో తమ విద్యాసంస్థ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమమైన శిక్షణ అందించి వారికి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పంచాయితీ కార్మికురాలికి దురదృష్ట ప్రమాదం

## మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలింపు

**కొడవలూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:** కొడవలూరు పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు శనివారం ప్రమాదానికి గురైంది. పనిచేస్తున్న సమయంలో ఆమె ట్రాక్టర్ నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను నెల్లూరులో ప్రైవేట్ వైద్యశాల, అక్కడ నుండి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించాలని సూచించారు.కోవూరు ఎమ్మెల్యేకి సమాచారం అందడంతో తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించారు. దీంతో గాయపడిన కార్మికురాలకి చెన్నై హాస్పిటల్ లో వైద్యం అందిస్తున్నారు.

## పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** పేద ప్రజలకు అండగా ఉంటూ ఎవరికి ఏ అవసరం, కష్టం వచ్చినా నేనున్నానంటూ ఒక భరోసా కల్పిస్తూ అందరికీ అండగా నిలుస్తున్న వ్యక్తి మాజీ శాసనసభ్యులు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అని ఆయన అభిమానులు తెలియజేశారు. కాటం రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినోత్స వ వేడుకలు సీనియర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోసల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కావలి ఏరియా వైద్యశాల నందు రోగులందరికీ రొట్టెలు,పండ్లు పంపిణీ చేయడం జరిగింది.అనంతరం గోసల గోపాల్ రెడ్డి,కాటం రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అభిమానులు మాట్లాడారు మాజీ శాసనసభ్యులు,వైసిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన్న సందర్భంగా కావలి ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న మంచి మనసున్న వ్యక్తి కాటంరెడ్డి అని తెలియజేశారు.ఆయన రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించి సేవచేసే భాగ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు.ఆయన ఆయురారోగ్యాలతోఅష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు – కాటంరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సజ్జల మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి జన్మద్నిన సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఫోన్లో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి యోగక్షేమలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అభిమానులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాట ఇస్తే తప్పని గుణం గౌడ కులస్థులది



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** మాట ఇస్తే తప్పని గుణం గౌడ కులస్తులుదని నీతి నిజాయితీకి మారుతీరని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియజేశారు .కావలి రూరల్ మండలం ఆమదాల దిన్నె గ్రామంలో ఆదివారం గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన మహో త్సవం ఘనంగా జరిగింది.ఈ మహోత్స వానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంక టకృష్ణారెడ్డి హాజరై వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేని గౌడ సంక్షేమ సంఘం నాయకులు, మహిళా ప్రతినిధులు, యువత ఘన స్వాగతం పలికారు.సభా ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి,నియోజకవర్గ ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.గౌడ సంఘం 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు నేను రాజకీయంగా ఎదగడంలో గౌడ సమాజం కీలక పాత్ర పోషించిందని నావిజయంలో మీ అందరి ఆశీస్సులు,మద్దతు ఉన్నందునే ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. నా జీవితాంతం గౌడ కులం కులస్థులకు రుణపడి ఉంటా అన్నారు. సమాజ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని గౌడ సంఘం భవన నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించడం జరిగింది. కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అందులో ప్రతి కులం, ప్రతి వర్గం సమాన భాగస్వామ్యం కలిగి ఉండాలన్నారు.మన సమాజ ఐక్యతే మన బలం అని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించడం జరిగింది.

## ఘనంగా రెడ్డి సంక్షేమ సంఘం కార్తీక వనభోజన మహోత్సవం



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని ఏటూరి రామిరెడ్డి కళ్యాణ మండపం నందు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొని సాంప్రదాయ పద్ధతిలో వనభోజన వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు,మహిళలు,యువత ఘన స్వాగతం పలికారు.మంగళ వాయిద్యాలతో,హర్షద్వానాలతో ఆహ్వానం పలికారు.అనంతరం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి రామిరెడ్డి తోటలోని శివాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించడం జరిగింది.ఇటీవల మృతి చెందిన ఏటూరి రామిరెడ్డి మృతికి సంతాపం తెలియజేసి ఆయన సేవలను కొనియాడారు.విద్యార్థులకు బుక్స్, స్కాలర్షిప్ పంపిణీ చేశారు.రెడ్డి సంక్షేమ సంఘం తరపున సేవలందించిన వ్యక్తులకను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు రెడ్డి సమాజం ఎప్పటి నుంచో సేవా ధ్యేయంతో ముందుకు సాగుతుందని సాంఘిక,ఆర్థిక రంగాల్లో మరింత బలపడాలంటే ఐక్యత అవసరమని తెలియజేశారు.యువత సేవాభావంతో,సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా ముందుకు నడవాలన్నారు. సేవాగుణంలో ఏటూరి రామిరెడ్డి ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సమాజం కోసం చేసిన సేవలకు గుర్తుగా ఆయన కాంస్య విగ్రహాన్ని వచ్చే కార్తీక వనభోజన మహోత్సవం నాటికి పూర్తి చేసేందుకు రెడ్డి సంక్షేమ సంఘం ముందుకు రావాలన్నారు.పేదరికంలో ఉన్న ప్రతి కుటుంబానికి సంఘం అండగా నిలవాలన్నారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. మీకు ఏకష్టం వచ్చినా కృష్ణారెడ్డి ఉన్నాడని గుర్తుంచుకోవాలి అంటూ సభలో ఎమ్మెల్యే భావోద్వేగంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగుమాటిని ఘనంగా సత్కరించి మెమొంటో అందజేయడం జరిగింది. అంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.

## పట్టణ వైయస్సార్సీపి



**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** కావలి పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా నెల్లూరు సీతారావమ్మ కు పదవి రావడం పై శ్రేయోభిలాషులు, అభిమానులు, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని పట్టణ ప్రజలు ఆకాంక్షించారు. కావలి పట్టణంలోని 25 వ వార్డు కౌన్సిలర్ గా పని చేసిన నెల్లూరు సీతారావమ్మ పార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి కోసం పాటుపడుతూ వార్డ్ అధ్యక్షురాలుగా మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికై ప్రతిపక్షంలో అధికారపక్షంపై పోరాట పటిమతో దీటుగా ఎదుర్కొని అందరి మన్ననలు అందుకున్నారు.పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ శానిటేషన్ కమిటీ చెర్మన్ గా పలు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడారు వార్డులో బస్సు షెల్టర్ డ్రైనేజీలు బోర్ వెల్స్ పలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. పార్టీ పట్ల విదేయత విశ్వాసంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. పదవి వచ్చేందుకు కృషి చేసిన వైఎస్ఆర్సిపి కావలి నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వం మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**ఆవాజ్ 5వ నగర మహాసభలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్**

**నెల్లూరు సిటీ, నవంబర్ 9, ప్రభాతవార్త** మైనారిటీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అన్నారు. ఆదివారం నగరంలో 54వ డివిజన్ టిడ్ కో అపార్ట్మెంట్ల వద్ద ఉన్న కమ్యూనిటి హాలు నందు ఆవాజ్ 5 మహాసభలు జరిగాయి. ఆవాజ్ సీనియర్ నాయకులు రియాజ్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రతినిధులు సభను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ 2022 నుంచి ఆవాజ్ మైనారిటీల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. జాతీయ స్థాయిలో మైనారిటీల పై దాడులు జరిగినప్పుడు కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోతుందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. 50 సంవత్సరాలకు పెన్షన్లు, దులహన్ పథకం అమలు, ఇమామ్, మోజన్ లకు గౌరవవేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మైనారిటీల సమస్యలపై అవగాహన చేసుకుని చైతన్యవంతం కావాలిని పిలుపునిచ్చారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఆవాజ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. సీనియర్ నాయకులు షేక్ రియాజ్ మాట్లాడుతూ హక్కుల పై ప్రస్తుతం దాడి జరుగుతుందన్నారు. హక్కుల కాపాడుకోవడం కోసం ఆవాజ్‌ని బలోపేతం చేసుకోవాన్నారు. ఆవాజ్ జిల్లా కోశాధికారి షేక్ చాన్ బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని అన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, ఐద్వా నగర కార్యదర్శి కె. పద్మ సౌహార్ద సందేశాలు చేసారు.

**- 13 మందితో నూతన కమిటీ ఎన్నిక**

అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ ఫయాజ్, షేక్ రియాజ్‌లు, సహాయ కార్యదర్శిగా షేక్ అల్లాబక్షు, ఉపాధ్యక్షులుగా షేక్ రియాజ్, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కలుగోల శాంభవి అమ్మవారికి బంగారు నేత్రాలు కానుక




**కావలి, నవంబర్ 9, ప్రభాతవార్త:** కావలి శ్రీ కలుగోళ శాంభవి దేవస్థానం నందు కావలి గ్రామ దేవత,అమ్మలు గన్న అమ్మ శ్రీ కలు గోల శాంభవి దేవి అమ్మవారికి బెంగుళూరు వాస్తవ్యులు మాగాటి కృష్ణకుమారి ఆదివారం ఆలయ ఈవో అరవ రాధా కృష్ణ సమక్షంలో బంగారు నేత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సర్టిఫికేట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాగాటి కృష్ణకుమారి మాట్లాడారు చాలా రోజుల నుంచి కలుగోళ శాంభవి దేవి అమ్మవారికి బంగారు కళ్ళు కానుకగా ఇవాలాని అనుకోవడం జరిగిందని సుమారు 40 గ్రాములుగలు కలిగిన 5లక్షల రూపాయల విలువ చేసే బంగారు నేత్రాలు,బులాకి,తిలకం చేయించి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.అమ్మవారి దీవెనల వలన మేము అనుకున్న కోరికలు అన్ని నెరవేరినందున అమ్మవారికి ఆభరణాలను చేయించడం జరిగిందని తెలియజేశారు.

అమ్మవారికి ఆభరణాలు అందజేసిన తరువాత సర్టిఫికేట్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు.ఎక్కడాకూడా ఈ విధంగా సర్టిఫికేట్ ఇవ్వడం చూడలేదని తెలియజేశారు.ఈ సర్టిఫికేటు ఫ్రేమ్ కట్టించుకొని అమ్మవారి జ్ఞాపకార్థంగా ఉంచుకుంటామని తెలియజేశా రు.దేవ స్థానం వారి చేత ఈ కార్యక్రమం చేయించినందున ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు.

## వైభవంగా అన్నాభిషేకం



**కోవూరు, నవంబం9ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ విశ్వేశ్వర స్వామి పుట్టిన నక్షత్రం ఆరుద్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అన్నాభిషేక కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు దంపతులు, ఉపాధ్యక్షులు సీహెచ్ వెంకటసుబ్బయ్య దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సింగంశెట్టి రమేష్, కోశాధికారి మెంటా రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

## కోవూరులో ఘోర ప్రమాదం
## - సీలింగ్ కూలి పడి కార్పెంటర్ దుర్మరణం



**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** పొట్ట కూటి కోసం కూలీ నాలీ పనులు చేసుకునే ఓ కుటుంబంలో ఆదివారం జరిగిన సంఘటన తీరని విషాదం నింపింది. రోజూవారీగా కా ర్పెంటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిం చే ఓ కుటుంబంలో సీలింగ్ కూలి పడి కార్పెంటర్ పట్నం ప్రసాద్ (48) తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం కోవూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో నెలకొంది. కోవూ రు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి నూతన గృహ నిర్మాణం చేప ్డుతు న్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నెల్లూరుకు చెందిన పట్నం ప్రసాద్ కార్పెంటర్ పనులు చేస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి లోపల భాగంలోని సీలింగ్ ఒక్కసారిగా ఊడిపడి ప్రసాద్ తలపైన పడింది. తీవ్ర గాయాలు కావడంతో సహచర కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే ఆయ నను పరీక్షించిన వైద్యులు ప్రసాద్ మృతిచెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న కోవూరు పోలీ సులు సంటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం పోస్టుమార్టకు తరలించారు. మరణించిన ప్రసాద్ స్థానికంగా స్లాబ్ ఉడ్ వర్క్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు, ఉదయం వరకు తమతో ఉండి పనులు చేసిన ప్రసాద్ ప్రాణాలు కోల్పోవడంతో సహచర కార్మికులు తీవ్ర విషా దంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి రోధిస్తున్న తీరు చూపరులను కలిచి వేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోవూరు పోలీసులు తెలిపారు.

## కార్తీక మాసంలో వనభోజనం అత్యంత ప్రీతికరం



**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో ఆదివారం నెల్లూరు జిల్లా శ్రీ వైకానస సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ వన సమారాధన కార్యక్రమం అత్యంత వైభ వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా వైకానస సంక్షేమ సంఘం అధ్యక్షుడు అలహరి లక్ష్మీ నారాయణ చార్యులు మాట్లాడుతూ ఈ కార్తీక మాసంలో ఇటువంటి వన సమారాధన కార్యక్రమాన్ని గత సంవత్సరాలుగా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. తొలిసారిగా కోవూరులోని కోదండరామ స్వామి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా పురోహిత సంఘం అధ్యక్షులు పారా శ్రీధర్ శర్మ, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ గుడ్లదొన వాసుదేవరావు, శ్రీ వైకానస సంక్షేమ సంఘం కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు, కోశాధికారి పరాంకుశం అనంత పద్మనాభాచార్యులు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీ వైకానస సంక్షేమ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వన భోజనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

## బేస్‌బాల్ క్రీడాకారిణి హర్షితకు ఘనసత్కారం

**- ఆర్థిక భరోసా కోసం రూ.46వేల అందజేత**



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాత వార్త-విద్య :** చైనా దేశంలో అక్టోబరు 26నుండి న వంబరు 2వరకు నిర్వ హించిన ఆసి యా కప్ ఉమెన్స్ బేస్‌బాల్ చాంపియన్ షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కరపరిచిన నెల్లూరు జిల్లా వెంకటాచలం గ్రామానికి చెందిన కడిమి నరేంద్ర కుమార్తె కడిమి హర్షి తను ఆదివారం నగరంలోని స్థానిక జాకీర్‌హుసేన్‌నగర్‌లోని ఎస్‌విఆర్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి మునగపాటి రమేష్ మిగిలిన సభ్యులతో కలిసి హర్షితకు శాలువాలు కప్పి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరిం చారు.అలాగే ఆర్థికభరోసా క్రింద రూ.46వేల రూపాయలను అందించారు.ఈ సందర్భంగా మునగపాటి రమేష్ మాట్లాడుతు పద్మశాలి కులానికి చెందిన హర్షిత అంతర్జాతీయస్థాయిలో రాణించటం గర్వకార ణమ న్నారు. అలాగే రానున్నరోజుల్లో ఆమే మరిన్ని విజయాలు సాదించాలని కోరారు. ఆమే విజయాలకు తమ యువసేన ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీఇచ్చారు. పద్మశాలి యువత అన్నిరంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి మాగం వెంకటేశ్వర్లు, కడిమి శ్రీనివాసు లు, ఎస్‌విఆర్ స్కూల్ అధినేత అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పద్మశాలి సంఘం జిల్లా అధ్య క్షులు కడిమి వెంకటశేషయ్య, నాయకులు సోమా గోపాల్, ఆలూరు సత్యవాణి, వింజమూరు వెంకటేశ్వర్లు, చేవూరు శ్రీనివాసులు, చింతలపూడి పెంచలయ్య గుత్తికొండశ్రీనివాసులు,కోచ్ మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

## నెల్లూరు సిటీ ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి నారాయణ

- నెల్లూరు చింతారెడ్డిపాలెం క్రాస్ వద్ద హైవేపై అండర్ పాస్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రూ.121కోట్లతో నిర్మాణానికి ఆమోదం తెలిపిన ప్రభుత్వం
- మంత్రి నారాయణ చొరువతో ఎన్నో ఏళ్ల నాటి కల నేడు సాకారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న నెల్లూరు సిటీ ప్రజలు
- చింతారెడ్డిపాలెం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలకు ఇక చెక్




**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త -వైద్యం** ఎన్నో ఏళ్ల నాటి ప్రజల కలను సాకారం చేస్తున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నిరంత కృషికి ఆ ప్రాంత వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. నెల్లూరు ప్రజలకు మంత్రి నారాయణ గుడ్ న్యూస్ చెప్పారు. నెల్లూరులో ట్రాఫిక్‌కు ప్రధాన సమస్యగా ఉన్న చింతారెడ్డి పాలెం క్రాస్ రోడ్డుకు మంత్రి చొరువతో మోక్షం లభించింది. ఈ ప్రాంతం మీదుగా నేషనల్ హైవేతో పాటు నెల్లూరు నుండి పలు గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో పాటు అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గమనించిన మంత్రి నారాయణ ఈ ప్రాంతంలో హైవేపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వంతో చర్చించారు. మంత్రి నారాయణ చూపిన చొరువతో ఏళ్ల నాటి కల త్వరలో సహకారం కానుంది. చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏకంగా రూ.121 కోట్ల నిధులను మంజూరు చేయించి చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీంతో మంత్రి నారాయణ చెప్పిన గుడ్ న్యూస్‌కి నెల్లూరు నగర వాసులతో పాటు ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నారాయణ సార్ చెప్పాడంటే చేస్తారంతే అంటూ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రమాదాల నివారణతో పాటు రాకపోకలకు అనువుగా ఉంటుందని ఈ ప్రాంత వాసులు కృతజ్ఞతాభావంతో ఆనందం వ్యక్తం చేశారు. దీంతో ఏళ్ల నాటి తమ కలను సహకారం చేస్తున్న మంత్రికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో లక్షదీపోత్సవంలో పాల్గొని తరించండి



**బుచ్చి నవంబర్ 9 ప్రభాతవార్త** కార్తిక మాసం పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలో ఈనెల 10 వ తేది సాయింత్రం 6 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో లక్షదీపోత్స వం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి తెలిపారు. కోవూరు శాసనసభ్యురాలు సూచనలతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరు పెద్దఎత్తున పాల్గొని కార్తిక దీపాలు వెలగించి స్వామి అమ్మవార్ల కటాక్షములకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## గాంధీజనసంఘం పంచాయితీ భవనానికి 32 లక్షలు మంజూరు



**సంగం నవంబర్ 9 ప్రభాతవార్త** సంగం మండలం గాంధీజనసంఘం గ్రామంలో నూతన పంచాయితీ భవన నిర్మాణానికి 32 లక్షల నిధులు మంజూరు అయినట్లు పంచాయితీరాజ్ డిఇ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషితో గాంధీన సంఘంలో పంచాయితీ భవనానికి భారీదా నిదులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. ఈ సందర్బంగా గాంధీ జనసంఘం టిడిపినాయకులు మానికల కృష్ణమూర్తి మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి,పంచాయితీరాజ్ ఏఇ రామయ్య తదితరులున్నారు.

## నూతన చైర్మన్‌కు అభినందనలు వెల్లువ




**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 9, ప్రభాతవార్త** శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం నూతన చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం వేదగిరిలోని(నరసింహ కొండపై) స్వామివారి సన్నిధిలో ఆదివారం వేడుకగా జరిగింది. చైర్మన్ ప్రమాణ స్వీకారం అనంతరం పెద్ద ఎత్తున విచ్చేసిన కూటమి నేతలు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డిని శాలువాలు కప్పి, బొకేలు అందజేసి అభినందనలతో ముంచెత్తారు. కార్యక్రమం అనంతరం దాదాపు గంటపాటు ప్రజలు పెద్ద ఎత్తున చైర్మన్‌ను సత్కరించారు.

## తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి
## కోవూరు సీఐ వి.సుధాకర్‌రెడ్డి




**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహద పడతాయని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని మైథిలి సెంటర్‌లో ఉన్న భవనంలో రాజేష్ అనే యువకుడు విద్యార్థినీ విద్యార్థులకు గత సంవత్సర కాలంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కోవూరుకు చెందిన అనేక మంది బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజేతల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలకు ఈ కరాటే అనేది ఎంతో ఉపయోగకరమన్నారు. ఆడపిల్లలు తమను తాము రక్షించుకునేందుకు ఈ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందని, దీని వలన వారిలో మానసిక స్థైర్యం పెంపొందించడమే కాకుండా ఆత్మ రక్షణకు ఈ కరాటే ఎంతగానో తోడ్పతుందన్నారు. ఈ క్రీడ వలన దేహదారుడ్య పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డలను ఈ క్రీడల పట్ల మక్కువ చూపించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కూడా క్రీడల పట్ల ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కరాటే కూడా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా మాజీ సభ్యులు ముసలి సుధాకర్, కరాటే మాస్టర్ రాజేష్‌లు పలు సూచనలు చేశారు. అనంతరం బహుమతులు సాధించిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.

**- అబ్బురపరిచిన విన్యాసాలు** ఈ విజేతల అభినందన సన్మానం సందర్భంగా శిక్షణ పొందిన చిన్నారులు ప్రదర్శించిన పలు విన్యాసాలు తల్లిదండ్రులు, అధికారులను ప్రత్యేకంగా ఆశ్చర్య పరిచాయి. గుండెలపై రాళ్లు పెట్టుకుని పగలకొట్టడం, ఒంటిచేత్తో ఐదు పెంకులను పగలకొట్టడం, గుండెపై పుచ్చకాయ పెట్టుకుని దానిని కత్తితో కట్ చేయడం వంటి విన్యాసాలు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్య పరిచాయి. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా చొరవ చూపిన రాజేష్‌ను ఇటు అధికారులు, అటు తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## అట్టహాసంగా వేదగిరి చైర్మన్ అచ్యుత ప్రమాణ స్వీకార మహోత్సవం

- 10 కోట్లతో దేవస్థానం అభివృద్ధికి కృషి
- ఇందుపూరు కుటుంబ సభ్యులు నాకు ఆప్తులు
- త్వరలో పొట్టెపాలెం కలుజుపై బ్రిడ్జికి టెండర్లు
- నియోజకవర్గంలో కూటమి నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి సాధిస్తా
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 9, ప్రభాతవార్త** జిల్లాలోని రూరల్ నియోజకవర్గంలో ప్రసిద్ది చెందిన శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థాన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్స వం ఆదివారం దేవస్థాన ప్రాంగణంలో( నరసింహ కొండపై) వేడుకగా జరి గింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సతీమణి విజితతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీ సమేతంగా శాలువా కప్పి సత్కరించారు. తదుపరి పాలక మండలి సభ్యులను సత్కరించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పాటు దేవస్థానం మాజీ పాలకమండలి చైర్మన్‌లు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, దేవరపాలెం సర్పంచ్ వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఒట్టూరు సంపత్ యాదవ్, జలదంకి సుధాకర్, జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్నొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దేవస్థానం అభివృద్ధి కోసం 10 కోట్ల రూపాయలు మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న కూటమి ప్రభుత్వంలో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వారి గౌరవానికి భంగం వాటిల్లకుండా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. తాను ఆనాడు ప్రభుత్వాన్ని ఎదిరించి 16 నెలలు దూరంగా ఉన్న నేపథ్యంలో నాకు అండగా నిలిచిన ప్రతి నేతను కార్యకర్తను గుర్తించుకుంటానని వివరించారు. ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, దొంతాలి గ్రామానికి చెందిన మలినేని వెంకయ్య నాయుడు వీళ్ళు ఇరువురిని నాకు పెద్దన్నలుగా భావిస్తానని భరోసా ఇచ్చారు. ప్రస్తుత చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి తండ్రి గతంలో చైర్మన్‌గా ఉన్నారని, బహుశా దేవస్థాన చరిత్రలో తండ్రి కొడుకులు ఒకే దేవస్థానానికి చైర్మన్‌లుగా ఉండడం ఇదే ప్రథమ అని అన్నారు. తాను ధనవంతుల కుటుంబంలో పుట్టకపోయినా మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టి మీ అందరి ఆదరాభిమానాలతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం, మీ అందరి ఆశీర్వాదాలతోనేనని గుర్తు చేసుకున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు చంద్రన్న విద్యుత్ వెలుగులు గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్‌ను అందించేందుకు తాను కృషి చేశానన్నారు. త్రీఫేస్ కరెంటు అందుబాటులో ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇది ముఖ్యమంత్రి సహకారంతోనే సాధ్యమైందని వివరించారు. అనంతరం దేవస్థాన నూతన చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారి దర్శన భాగ్యానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతానని వివరించారు. తాగునీరు, భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో దేవస్థానం అభివృద్ధి కోసం అవసరమైన పనులు చేపట్టి, రాబోయే రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. విశేషమైన రోజుల్లో అధికంగా విచ్చేసే భక్తులను దృష్టిలో పెట్టుకుని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

**- త్వరలో పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జికి టెండర్లుః ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధ్‌రెడ్డి**

పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మించడం ఆ ప్రాంత ప్రజల కల అని, ఆ కల త్వరలోనే సాకారం కాబో తుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రేపో మాపో టెండర్లు పిలిచేందుకు అనుమతులు వస్తాయని హర్షం వ్యక్తం చేశారు. తాను ఐదేళ్లకోసారి ఓట్ల కోసం వచ్చే నాయకుడిని కాదని ప్రజల్లో ఉంటూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు.త్వరలోనే ములుమూడి కలుజుపై కూడా బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని నియోజకవర్గంలో మంచినీటి సౌకర్యం,రోడ్ల నిర్మాణం, స్మశానాల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. దేవస్థానం ఈవో వేమూరి గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ శివపార్వతుల కల్యాణం




**కలిగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త;** శిద్ధకొండూరు శిద్దయ్య కొండపై శ్రీ పార్వతీ మరమేశ్వరుల కల్యాణం ఆదివారం అంగరంగ వైబవంగా జరిగింది.కలిగిరి మండలంలోని శిద్దనకొండూరు కొండపై కొలువున్న శ్రీశిద్దేశ్వర ఆలయంలో కార్తీక మాస వేడుకలు అత్యంత వైబవంగా జరుగుతున్నాయి.ఆలయంలో స్వాములకు నిత్యఅన్నదానాలు, స్వామివారికి అభిషేకాలు,అన్నప్రసాదాలు, ప్రతినిత్యమూ జరుగుతున్నాయి. ఆలయానికి ఉత్తరబాగంలో కొలువైన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలోనూ స్వామివారికి అభిషేకాలు మెండుగా జరుగుతున్నయి. ఈ క్రమంలో శిద్దీశ్వరుని ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయకమిటీ సబ్యులు దాతల సహకారంతో ఆలయ కమిటీ చైర్మన్ రూపిశెట్టిరాము ఆద్వర్యంలో కల్యాణ మహోత్స వం నిర్వహించగా కల్యాణం చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, శివయ్య బక్తులు, అయ్యప్పస్వాములు తదితరులు తరలివచ్చి కల్యాణాన్ని కనులారా తిలకించారు. దివిలో జరిగే స్వామివారి కల్యాణం కార్తీక మాసం కాలంలోభువిలోజరుగడం దేవతలుసైతం ఆనందించే ఈ దేవదేవుని కల్యాణం చూసి మురిసిపోయింతగా జరిగింది. ఆలయ ఆగమ పండితులు, పౌరోహితులుస్వామి వారికీ పార్వతీ దేవికీ అంగరంగ వైభవంగా శుబముహూర్తాన పెండ్లి జరిపించారు. కల్యాణ అనంతరం పైద్దఎత్తున వచ్చిన బక్తులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామి అమ్మవార్ల గ్రామ ఉత్సో వం నిర్వహించారు.

## దళితుడీ ఇల్లు కూల్చివేతపై రాజకీయ సమరం చెలరేగుతోందా?

**న్యాయం కోసం బాధిత కుటుంబం ఎదురుచూస్తోంది**



**తోటపల్లి గూడూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:**మండలంలోని తోటపల్లి పంచాయతీ దక్కిలివారి పాలెంలో జరిగిన ఇంటి కూల్చివేత ఘటనపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మండల వైయస్సార్‌సీపీ అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్.తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనను ఆయన"మానవతా విలువలకు విరుద్ధమైన చర్య"గా అభివర్ణించారు. అనాదిగా స్వాధీనంలో ఉన్న భూమిలో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి మీదూరు సీనయ్య నిర్మిస్తున్న ఇంటిని రాజకీయ కక్షలతో కొందరు టిడిపి దుర్మార్గులు, అధికారులతో కుమ్మక్కై కూల్చేశారని ఆయన విమర్శించారు.ఒక దళిత కుటుంబం కష్టానికి ప్రతీకగా నిలిచిన ఆ ఇల్లు నేలమట్టం చేయడం సామాజిక న్యాయానికి పెద్ద దెబ్బ. ఇంత పెద్ద అన్యాయం జరిగిపోయినా, స్థానిక శాసనసభ్యులు నిశ్శబ్దంగా ఉండటం విచారకరం" అని మండల అధ్యక్షులు మండిపడ్డారు.ఈ సంఘటనపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దృష్టికి అంశాన్ని తీసుకెళ్తామని, అవసరమైతే న్యాయపరమైన చర్యలు కూడా చేపడతామని ఆయన హెచ్చరించారు. బాధితుడు సీనయ్య తనకు జరిగిన అన్యాయాన్ని మీడియా ముందు వివరిస్తూ కన్నీరు మున్నీరయ్యాడు. సమావేశంలో మాజీ సర్పంచ్ తోటపల్లి రామాచార్యులు, వైయస్సార్‌సీపీ నేత చిరంజీవి గౌడ్, జడ్పీటీసీ శేషమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త -వైద్యం** బ్లడ్ సెంటర్‌లో తగినంత రక్త నిల్వలు ఉన్నప్పుడే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు పేర్కొన్నారు. నెల్లూరులోని రెడ్ క్రాస్‌లో ఆదివారం ఆయన 117వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తాను రక్తదానం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రికార్డు స్థాయిలో రక్తదానం చేసిన దాతగా తనకెంతో సంతృప్తి కలుగుతుందన్నారు. రక్తదానం పట్ల యువత అవగాహన కలిగి ఉండి, ఆపదలో ఉన్న సాటి మనిషిని కాపాడేందుకు ఉపయోగపడేలా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ వైస్ చైర్మన్ చమర్తి జనా ర్ధన్‌రాజు, బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, మాటివేటర్ అరిగెల సాయిరాం, హెల్పింగ్ హ్యాండ్ ప్రెసిడెంట్ పురాణం లోకేష్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.